

నేనొక సామాన్యమైన రచయితను. సంఘాన్ని రకరకాల దృక్కోణాలలో పరిశీలించడం నా హాబీ. నా పరిశీలనలో ఎన్నో విశేషాలు బయట పడుతూంటాయి. వాటిని కథలుగా మలుస్తాను. నవలలుగా రూపొందిస్తాను. నారచనలు చాలా పత్రికలలో ఆదరించబడ్డాయి. నా రచనలు నాకుడబ్బును, పేరును కూడా సంపాదించి పెడుతున్నాయి. అయితే నేను కేవలం డబ్బు కోసం రచనలు చేయడం లేదు. నా భావాలను పలువురు పాఠకులతో పంచుకోవాలన్నకోరిక నా చేత రచనలు చేయిస్తూ నన్ను రచయితగా నిలబెడుతోంది.

రచనల వల్ల నేను డబ్బు సంపాదిస్తున్నాను కానీ, నా అవసరాలకు అది చాలదు. నాకు ఇద్దరు అక్కలుండేవారు. వాళ్ళ పెళ్ళిళ్ళు

చేసి నాన్న దివాలా తీశాడు.
ఇప్పుడు నాకో చిన్న ఉద్యోగం ఉంది.

ఉంది. కానీ నాన్న లేడు. అమ్మ

# బురదలో కమలం

—వసుంధర



పోతూ పోతూ నాన్న నాకు ఆస్తీ మిగల్చలేదు, అప్పులూ ఉంచలేదు. అమ్మనూ, చెల్లెల్నీ అప్పగించి పోయాడు. చెల్లెలిపెళ్ళి నా బాధ్యత. చెల్లెలు నా ప్రాణంలో ప్రాణం.

నాకు కొన్ని ఆశయాలున్నాయి. ఏ పరిస్థితుల్లోనూ నా పెళ్ళికి కట్నం తీసుకో కూడదని. ఈ ఆశయం అమ్మ కిష్టం లేదు. అందుక్కారణం ఆవిడ ధనాశ కాదు. నా చిన్న ఉద్యోగంతో ఇంటి అవసరాలన్నీ తీరుస్తూ చెల్లెలి పెళ్ళికి డబ్బు కూడ బెట్టడం అన్నది అసాధ్యం. నా కథలమీద ఇంతో అంతో ఆదాయం వస్తోంది కాబట్టి కాస్త శుభ్రమైన బట్టలైనా కొనుక్కొంటున్నాం. లేక పోతే దానిక్కూడా గతిలేదు.

నా చెల్లెలు చాలా అందంగా ఉంటుంది. దానికి ఈడూ-జోడుగా ఉండే వరుణ్ణి చూడాలని నా కోరిక. నా కోరికకు తగ్గ వరుళ్ళు చాలా మంది దొరికారు కానీ, అందరూ పదిహేను వేలకు పైగా కట్నం అడుగుతున్నారు.

చెల్లాయి చాలా తెలివైనది. ప్రస్తుతం అది బియ్యే చదువు తోంది. సాహిత్యంపట్ల దానికి అభిలాష. నా రచనలంటే దానికి చాలా ఇష్టం. తెలుగుదేశంలో నా లాంటి రచయిత పుట్టలేదంటుంది. అదన్నమాటల్లో నిజం ఎంతున్నా నాకు చాలా సంతోషం కలుగుతూంటుంది.

ఒకరోజున చెల్లాయి నా దగ్గరకు వచ్చి తన పెళ్ళి విషయంలో ఓ ఖచ్చితమైన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. తనను కట్నం లేకుండా పెళ్ళి చేసుకోడానికి ఏ పురుషుడూ ముందుకురాని పక్షంలో అది ఆజన్మ బ్రహ్మచారిణిగా ఉండిపోతుంది తప్పితే, పెళ్ళి చేసుకోదట. ఈ ఆవేశం కాలేజీలో జరిగిన వక్తృత్వపు పోటీల్లో పుట్టింది దానికి.

వరకట్నం సమస్య కారణంగా గుల్లైపోయిన సంసారం మాది. ఇలాంటి సంసారాలు ఆంధ్ర దేశంలో ఎన్నో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎన్నో శాసనాలుచేసింది కానీ, ఫలితం కనబడ్డంలేదు. కారణమేమిటి?

నాలోని రచయిత మేల్కొని ఈ సమస్యను పరిశీలించ నారంభించాడు. పరిశీలిస్తూంటే ఎన్నో ఆశ్చర్యకరమైన విశేషాలు బయట పడ్డాయి.

నేను పరిశీలించిన విశేషాల్లో ఒక చక్కని నవలకు వస్తువు

పుట్టింది. నవల వ్రాసి చదివాను. చాలా బాగా నచ్చిందనిపించింది. వరకట్నాన్ని సెంట్రల్ థీమ్‌గా తీసుకుని ఆ నవలరాసి ఒక పత్రిక నిర్వహిస్తున్న నవలల పోటీకి పంపాను.

ఈలోగా చెల్లెలి ఆవేశానికి సంబంధించిన అసలు కథ బయట పడింది. తన కాలేజీలో పని చేస్తున్న రామారావు అనే లెక్చరర్ పట్ల ఆకర్షితురాలవుతోందామె. వక్తృత్వపు పోటీలో అతడామెనభినందించడంతో వారిద్దరి మధ్యనూ పరిచయం ప్రారంభమై ఇప్పుడిప్పుడే ప్రేమ అనదగ్గ స్థాయికి చేరుకుంటోంది. ఈ విషయమైకొన్నిపుకార్లు వినికంగారుపడి నేను చెల్లెలినే నేరుగా అడిగేశాను.

చెల్లాయి ముందు కాస్త సిగ్గుపడినా తర్వాత ధైర్యంగానే విషయాన్ని చెప్పేసింది. రామారావు తనను ప్రేమిస్తున్నాడట. పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. ఆశయాలిద్దరివీ ఇంచుమించు ఒకటేనట. తనకూ్కడా రామారావు నచ్చినట్లే!

"రామారావు కట్నం కావాలంటే?" అన్నాను నేను.

"అనడు. ముమ్మాటికీ అనడు" అంది చెల్లాయి.

సరేనని నేను వెళ్ళి రామారావును కలుసుకున్నాను. నన్ను నేను పరిచయం చేసుకోగానే అతను తడబడ్డాడు. కాస్త మాటలయ్యాక అతను మామూలుగానే మాట్లాడాడు. నేను పెళ్ళి ప్రసక్తి తీసుకురాగానే అతను సిగ్గుపడ్డాడు. చెల్లాయంటే అతనికెంతో ఇష్టమని తెలిసింది. కట్నం గురించి సూటిగానే అడిగేశాను. కట్నమంటే తనకు అసహ్యమని చెప్పాడతను. నేను చాలా సంతోషించాను. ఎందుకంటే రామారావు మనిషి బాగున్నాడు. చెల్లెలికి ఈడూ జోడూ బాగుంటుంది. మంచి ఉద్యోగం. పైగా తల్లిదండ్రుల కొక్కడే కొడుకు.

నేను అతని దగ్గర తల్లిదండ్రుల అడ్రసు తీసుకున్నాను. ఇంటికి వెళ్ళి అమ్మకు విషయం చెప్పాను. అమ్మ కూడా సంతోషించింది. పిల్లను చూసుకుందుకు రావల్సిందిగా నేను రామారావు తల్లిదండ్రులకు ఉత్తరం రాసి అమ్మకు చదివి వినిపించాను. తర్వాత ఆ ఉత్తరం పోస్టు చేశాను.

ఉత్తరం పోస్టు చేసిన మర్నాడే టెలిగ్రాం వచ్చింది. నా నవలకు పోటీలో మొదటి బహుమతిగా రెండు వేల రూపాయలు వచ్చాయి. నేనెంతో సంతోషించాను. చెల్లెలి

పెళ్ళి నిశ్చయమయ్యే సమయానికే ఇది రావడం శుభ సూచకమనిపించింది. అమ్మ కూడా అలాగే అంది. అర్థమున్నా లేకపోయినా ఇలాంటి సెంటిమెంట్లు అనుకోని తృప్తినిస్తూంటాయి.

ఉత్తరం రాసేక రామారావును కలుసుకుని ఉత్తరం రాసిన విషయం చెప్పాను. అతను తనూ ఇంటికి ఉత్తరం రాసినట్లు తెలిపాడు. నా నవలకు బహుమతి వచ్చినట్లు విని నన్నభినందించాడు.

నెల్లాళ్ళు గడిచినా రామారావు తల్లిదండ్రుల నుంచి ఉత్తరం రాలేదు. నేను అతన్ని కలుసుకున్నాను-"కొన్ని ఇబ్బందులున్నాయండీ: వచ్చేనెలలో సెలవులిస్తారు గదా-నేను ఇంటికి వెళ్ళి మా వాళ్ళతో మాట్లాడి వస్తాను. ఈ పెళ్ళి జరిగి తీర్తుంది. మా ఇంట్లో నా ఇష్టానికి ఎదురులేదు" అన్నాడతను. అతని మాటలు నాకు చాలా ధైర్యాన్నిచ్చాయి.

ఈలోగా నా నవల ప్రచురించబడింది. ప్రచురించబడ్డ వారం రోజుల్లో నన్నభినందిస్తూ చాలా ఉత్తరాలు వచ్చాయి. ఈ నవల వరకట్నమనే దురహంకారానికి బలిపశువు కాగలదని చాలామంది అన్నారు. నేను చాలా ఆనందించాను. రెండు వేలూ పెళ్ళికయ్యే చిల్లర ఖర్చుల కోసం బ్యాంకులో వేశాను.

కాలేజీలకు సెలవులిచ్చారు. ఇంటికి వెళ్ళే ముందురోజు రామారావును మా ఇంటికి భోజనానికి పిలిచాను-గతికితే అతకదన్న పాత సామెతను దూరంగా పెట్టి. అతను అమ్మతో ఎంతో చనువుగా అభిమానంగామాట్లాడాడు. అలాంటతను ఇంటల్లుడౌతున్నందుకు అమ్మ చాలా సంతోషించింది.

ఈలోగా నా నవల పడ్డాక తర్వాతి సంచిక కూడా వచ్చింది. అందులో నవల గురించి కొన్ని ఉత్తరాలున్నాయి. నా నవలకు పాఠకుల నుండి వచ్చిన రెస్పాన్స్‌కు హర్షాన్ని వెలిబుచ్చుతూ సంపాదకీయం కూడా వ్రాయబడింది.

ఈలోగా రామారావు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అతను, తల్లిదండ్రులు పెళ్ళి చూపులకు వస్తున్నారట. అప్పటికి నా మనసు స్థిమితపడింది.

వ్రాసిన రోజుకి రామారావూ, తల్లిదండ్రులూ మా ఇంటికి విచ్చేశారు. మేము వాళ్ళకు మర్యాదలు బాగానే చేశాం. వాళ్ళూ మంచి మర్యాదస్థుల్లాగానే ఉన్నారు. రామారావు తండ్రి నన్నూ, నా

రచనల్నీ మెచ్చుకున్నాడు. బహుమతి పొందిన నవల కూడా చదివానని చెప్పాడు.

చెల్లాయిని చూపిస్తే-"అబ్బాయి ఇష్టపడ్డాక వేరే పెళ్ళి చూపులేమిట్లే-ఏదో తంతు నడిపించడమే" అన్నాడు.

ఆ తంతు ముగిసింది. అప్పుడు రామారావు తండ్రి నెమ్మదిగా నాతో అన్నాడు-"మావాడి పెళ్ళి మాక్కావలసిన బంధువు అమ్మాయి పెళ్ళితో ముడిపడి ఉంది. ఒకసారి నువ్వు ఆ పిల్లను చూసుకుందువు వస్తే, రెండు పెళ్ళిళ్ళూ ఒక్కసారి జరిపించేయొచ్చు!"

ఇది విని కంగారుపడ్డాను.

ఆయన నా కంగారు చూసి-"వీడికొచ్చిన కట్నం డబ్బుల్తో దాని పెళ్లి చేద్దామనుకున్నాం. కానీ వీడు కట్నం లేని పెళ్ళి చేసుకుంటున్నాడు గదా! అందుకని దానికీ అలాంటి సంబంధమే చూడాలి. అందుకు నువ్వు తప్ప వేరే ఎవరు దొరుకుతారు?" అన్నాడు.

నాకు అర్థమైపోయింది. ముసలాడు మంచి ట్రిక్కే వేశాడు.

ఏమనాలో తెలియక-"కట్నం తీసుకోకూడదని నా ఆశయమండీ! కాని పిల్ల నచ్చాలి కదండీ?"

"చూసాకనే అన్నీ మాట్లాడుకుందాం" అన్నాడాయన.

ఆయన పెట్టిన లంకె సామాన్యమైనది కాదు. అంగీకార సూచకంగా తలాడించాను. అప్పటికి వాళ్లు వెళ్లిపోయారు.

పదిరోజుల తర్వాత పెళ్లి చూపులకు నేను, చెల్లాయి వెళ్లాం. పెళ్లికూతురికి మెల్ల కన్ను, ఎత్తు పళ్లు.

ఆ పిల్ల చెల్లాయికే నచ్చలేదు. రామారావు అడపెళ్లి వారింట్లోనే ఉన్నాడు. అతనితో నా బాధ చెప్పుకుంటే అతను అదోలా నవ్వి-"డబ్బు లేకుండా దీన్నెవ్వరూ చేసుకోరని నాకూ తెలుసు. కానీ నాన్న నా పెళ్లికీ దీని పెళ్లికీ లంకె పెట్టాడు" అన్నాడు.

"డబ్బిస్తే మాత్రం ఈ అమ్మాయి నెవరు చేసుకుంటారండీ?" అన్నాను.

"ఎందుకు చేసుకోరు? పదివేలిస్తే చాలు-రెండు మూడు సంబంధాలు సిద్ధంగా వున్నాయి" అన్నాడు రామారావు. నేనాశ్చర్యపోతూంటే అతను— "రచయితలు ఐహిక సౌందర్యానికికాక మానసిక సౌందర్యానికి ప్రాధాన్యత నిస్తారంటారు. దాని మనసెంత దొడ్డదో వర్ణించడానికి నేను రచయితను కాను. కానీ అర్థం చేసుకున్న ప్రతి

ఒక్కరికీ దానిలో దేవత కనబడు తుంది" అన్నాడు.

అతని మాటల్లో వెటకార ముందేమోనని భయం వేసింది. అనాకారితనం తప్పుకాదు. కానీ నేను కూరూపిని జీవిత భాగ స్వామిగా స్వీకరించడానికి సిద్ధంగా లేను. చెల్లెలి పెళ్లి కోసం త్యాగంగానైనా ఈ పని చేయలేను.

నేను తటపటాయిస్తున్నట్లు గ్రహించిన చెల్లాయి రామారావుతో తను వ్యక్తిగతంగా మాట్లాడ తానంది. సరే వెళ్లి మాట్లాడ మన్నాను.

అయితే చెల్లాయి వచ్చి చెప్పిన కొత్త విశేషమేమీ లేదు. అతను కాస్త విచారంగా ఉన్నాడట. నేనా మాత్రం త్యాగం చేస్తానని అను కున్నాడట. ప్రస్తుతానికి మనసు బాగాలేదనీ, త్వరలో ఉత్తరం రాస్తాననీ, ఏ పరిస్థితుల్లోనూ తమ పెళ్లి ఆగదనీ చెప్పాడట.

ఇద్దరం ఇంటికి వెళ్లిపోయాం. వారం రోజుల్లో రామారావు తండ్రి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

నేనింత నిష్కర్షగా పిల్ల నచ్చ లేదని చెప్పాను కాబట్టి తనూ నిష్కర్షగా ఉండక తప్పదట. ఆ పిల్ల పెళ్లి గురించి పదివేల రూపాయలు ఇవ్వగలిగితేనే రామా రావు పెళ్లి నా చెల్లెలితో జరుగు తుందట.

ఉత్తరం చదివి చెల్లాయి మండి పడింది. అసలు వాళ్లాడిందంతా పెద్ద నాటకమనీ, కట్నం తీసుకో డానికి వేసిన ఎత్తనీ, తనీ పెళ్లి చేసుకోననీ, ఏ పరిస్థితుల్లోనూ నేనా ఎత్తుపళ్ల పిల్లని తనకు వదినగా తీసుకురావడానికి వీల్లేదనీ అంది. అప్పుడే రామారావుని అసహ్యించు కోవడం ప్రారంభించింది కూడా.

అమ్మ మాత్రం మగపెళ్లివారిని పూర్తిగా సమర్థించింది. మమ్మల్ని తిట్టిపోసింది. నిక్షేపం లాంటి సంబంధం చెడగొట్టవద్దని నాకు మరీమరీ చెప్పింది. ఈ సం బంధాన్ని వదులుకుంటున్నట్లు రాస్తే తనమీద ఒట్టేసింది. వెధవ సెంటి మెట్లు-అప్పుడప్పుడు మనుషుల్ని ఇరుకులో పెట్టేస్తూంటాయి.

ఉత్తరం రాయకుండా ఊరు కుంటే వాళ్ళే అర్థం చేసుకుం టారు గదా అని నేనూ ఊరు కున్నాను.

ఇలా ఉండగా ఆ ఉత్తరం వచ్చిన నాలుగురోజులకు నాకు మద్రాసునించి ఓ ఉత్తరం వచ్చింది. ఓ ఫిలిం ప్రొడ్యూసర్‌కు నా నవల నచ్చిందట. పదివేలిచ్చి

సినిమా తీసే హక్కులు కొంటాడట. జవాబు వ్రాయమన్నాడు.

నాక్కలిగిన సంతోష మింతా అంతా కాదు. సినిమా రంగంలో అడుగుపెట్టగలిగితే అంతా డబ్బే కదా అని పొంగిపోయాను. రెండు వారాల్లో వరకట్నం గురించి నేను వ్రాసిన నవలను ఆ ప్రొడ్యూసర్ చేతిలో పెట్టి పదివేల రూపాయలు సంపాదించేశాను. వేలాది పాఠకుల్ని అలరించి ప్రభావితుల్ని చేసిన ఆ నవల ఇప్పుడు కోట్లాది ప్రేక్షకుల్ని ప్రభావితుల్ని చేయబోతోంది.

చేతిలోకి డబ్బురాగానే తాత్కాలికంగా నా ఆశయాల్ని పక్కన పెట్టాను. అనుకోకుండా వచ్చిన ఆ డబ్బుతో చెల్లెలి పెళ్ళి జరిపించాలనుకున్నాను.

"ఈ రోజుల్లో కట్నం లేకుండా పెళ్ళిచేసుకుంటామని ముందుకు వచ్చే మగ కుర్రాళ్ళు అరుదు. అలా ముందుకు వచ్చిన రామారావుని కాదంటే నీకు మళ్లీ సంబంధం ఇంతమంచిది దొరకదు. పైగా అతను నిన్ను ప్రేమిస్తున్నాడు కూడా. నీ కట్నం డబ్బు కష్టపడక్కర్లేకుండా వచ్చింది. ఆ డబ్బు మరో ఆడపిల్ల పెళ్లికోసమే వినియోగించ బడుతుంది. కాబట్టి ఈ పెళ్లి జరగాలనే నేను అనుకుంటున్నాను" అని నేనంటే చెల్లాయి మరీ ఎక్కువగా అభ్యంతర పెట్టలేదు. అమ్మయితే సంతోషించింది కూడా.

చెల్లాయి పెళ్లి రామారావుతో నిరభ్యంతరంగా జరిగిపోయింది.

ఇప్పుడు నేను విడుదలయ్యే నా సినిమాకోసం ఎదురుచూస్తున్నాను. కానీ ఒక అనుమానం నన్ను పట్టుకు వేధిస్తోంది.

నా నవలలో వరకట్న సమస్యలను ఒక పిశాచిగా అభివర్ణించాను. నేటి యువతరం ముందడుగు వేసి ఆ పిశాచిని దారుణంగా ఎదుర్కొంటే తప్ప సత్ఫలితాలుండవని రాశాను. ఎన్నో మంచి పరిష్కారాలు సూచించాను.

ఆ రచనవల్ల పాఠకులు ఏ విధంగా ప్రభావితులైనారు?

ఈ ప్రశ్నకు సమాధానం గురించి ఆలోచించే ముందు నాకు తెలిసిన కొందరు వ్యక్తులు మెదులుతున్నారు.

రామారావు తండ్రి ఆ నవల చదివాడు-కొడుకు పెళ్ళికి కట్నం అడిగాడు. రామారావు నవల చదివాడు- కట్నం తీసుకున్నాడు. నా చెల్లెలా నవల చదివింది—కట్నమిచ్చే పెళ్ళికి అంగీకరించింది.

కట్నం కోరిన భర్తను ఆమోదించింది. నేనా నవలను వ్రాశాను- నేను నా చెల్లెలి పెళ్ళికి కట్నం ఇచ్చాను.

అసలు ఎందరినో వరకట్నానికి వ్యతిరేకంగా ప్రభావితుల్ని చేయాలన్న ఉద్దేశ్యంతో వ్రాయబడ్డ నవల ఏం చేసింది? వరకట్నానికి అవసరమైన డబ్బు నాకు సంపాదించి పెట్టింది.

డబ్బు లేక నేను వరకట్నాన్ని నిరసించాను గానీ, నాల్గుడబ్బులు చేరగానే నేనా ఆశయం సంగతే మరిచిపోయాను. ఇలా ఆశయాల్ని అవకాశాలతో ముడిపెట్టిన నేను రచనలుచేసి పాఠకులను ప్రభావితుల్ని చేయడానికి అర్హుడినా?

నేను నా రచనలకులా ఉన్నతమైన వాణ్ణి కాకపోవచ్చు. అంతమాత్రాన ఉన్నతమైన భావాలు స్ఫురించినప్పుడు, వాటిని నల్గురి ముందూ సాహిత్య రూపంలో నిలపగల శక్తి ఉన్నప్పుడు- ఆచరణలో వాటిని సాధించక పోయినా - రచయితగా రచనలు చేయడం మానకూడదు అని నా అభిప్రాయం.

బురదలో పుట్టిన కారణంగా కమలాన్నెవరూ అసహ్యించుకోరు. నా రచనలు పద్మాలవంటివి. నేను బురదవంటివాణ్ణి. నా రచనలకు లభించిన గౌరవం నాది కాదు. ఈ విషయం గుర్తించి నా అహాన్ని చంపుకో గలిగితే చాలు.

నన్ను నేను బురదతో పోల్చుకోవలసి వచ్చినందుకు విచారంగానే ఉన్నా నూటికి నూరుపాళ్ల నిజం అది!

నాలాంటి రచయితలెందరున్నారో తెలియదు కానీ, ఈలోగా నేను మరో బురదను గుర్తించాను. నా నవల సినిమాగా పెద్ద హిట్టయింది. దానిమీద ప్రొడ్యూసర్ బాగా డబ్బు సంపాదించాడు. ఆ తర్వాత ఆ ప్రొడ్యూసర్ కూతురు వివాహం-ఓ పెద్ద పారిశ్రామికవేత్త కొడుకుతో వైభవంగా జరిగింది.

ప్రొడ్యూసర్ మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు ఎంతో ఆనందంగా- కొత్త కథ కోసం.

బురదా, బురదా కలుస్తాయి. కొత్త కమలాలూ విరుస్తాయి. ఈ భూమ్మీద బురదపాలు ఎక్కువ. కమలాలు తక్కువ. ఆ కమలాలు వెలసిన బురదను కాక కేవలం ఆ కమలాలనే ఆరాధించే సౌందర్య పిపాసుల సంఖ్య పెరిగేవరకూ సాంఘిక దురాచారాలన్నీ అలా కొనసాగుతూనే ఉంటాయి. ◆